క్లుప్తంగా...

పదవీ విరమణ



బాబమ్మకు చెక్కును అందజేస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (ఎల్‌జీఎస్)గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన బాబమ్మను ఘనంగా సత్కరించారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో విధులను నిర్వహించిన ఆమెను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సత్కరించారు. ఈ సందర్భంగా క్రెడిట్ సొసైటీ ఫండ్ కింద రూ.30వేల చెక్‌ను బాబమ్మకు అందించారు. అలాగే పొదుపు మొత్తం రూ.2.60 లక్షలు తన బ్యాంక్ ఖాతాలో జమచేశామన్నారు.

ఓ బై అరియా లైఫ్ వాటర్‌తో భాగస్వామ్యం



మాదాపూర్: పర్యావరణం పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తున్నట్లు నొవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రుబియన్ చెరియన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని నొవాటెల్‌లో శుక్రవారం ప్రపంచంలో మొట్టమొదటి ప్యాకేజ్డ్ అట్మాస్పియరిక్ మినరల్ వాటర్ ఓబై అరియా లైఫ్ వాటర్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్లు తెలిపారు.

'మనూ'ను సందర్శించిన ఐఎఫ్ సీపీఏఆర్ డైరెక్టర్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని న్యూఢిల్లీలోని ఇండో–ఫ్రెంచ్ సెంటర్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ అడ్వాన్స్‌రీసెర్చ్(ఐఎఫ్‌సీపీఏఆర్) డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్‌సేథ్ సందర్శించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో పర్యటించి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌తో తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం పరిపాలనాభవనంలోని సమావేశ హాల్‌లో సీనియర్ ఫ్యాకల్టీలతో సమావేశమయ్యారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను తిప్పికొట్టండి



మాట్లాడుతున్న గాదగోని రవి

మియాపూర్: ప్రజలపై భారం మోపే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ప్రభుత్వాల లక్ష్యాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని ఎంసీపీఐయూ గాదగోని రవి పిలుపునిచ్చారు. మియాపూర్ ఎంఏనగర్‌లోని గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయం వద్ద గ్రేటర్ హైదరాబాద్ స్థాయి పార్టీ సభ్యుల విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నిన్నటి వరకు పెట్రోల్, డీజిల్ నిత్యవసర వస్తువుల భారాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై విపరీతంగా మోపిందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యురాలు విమల తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 25 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో నలుగురికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 19 మందికి నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

లీకేజీలతో తాగునీరు వృథా



ఎన్బీటీ నగర్‌లో తాగునీరు లీకేజీతో బురదమయంగా మారిన రోడ్డు

బంజారాహిల్స్: ఎన్బీటీ నగర్ బస్తీలో తాగునీరు సరఫరా అయిన ప్రతిసారీ పెద్ద ఎత్తున లీకేజీ అవుతుండటంతో భారీగా నీరు నేలపాలవుతోంది. బస్తీలోని కల్లు కంపౌండ్ వద్ద నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ప్రధాన రోడ్డు మొత్తం మంచినీటితో బురదమయంగా మారుతోంది. పక్కనే ఉన్న రేషంబాగ్‌లో కూడా ఇదే పరిస్థితి ఉంది. బస్తీలో జరుగుతున్న మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులు మందకొడిగా సాగుతుండటంతో గత మూడు నెలలుగా మంచినీరు ఇలా వృథాగా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఈ లీకేజీలను అరికట్టాలని వారు కోరుతున్నారు.

మారనున్న హుడా కాలనీ రూపురేఖలు

- కాలనీలో ఇలూజన్ పార్కు ఏర్పాటుకు చర్యలు
- 4 ఎకరాల్లో రూ.2.60 కోట్ల వ్యయంతో నిర్మాణం
- సైకిల్‌ట్రాక్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు
- చిల్డ్రన్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ ఏర్పాటు
- ఇది కాలనీలో ఏర్పాటు చేసే రెండో థీమ్ పార్కు
- నల్లగండ్ల హుడాకాలనీలో రెండు పార్కుల నిర్మాణం పరిస్థితి'



నల్లగండ్ల హుడా కాలనీలోని భగీరథ పార్కు ఇలూజన్ థీమ్ అభివృద్ధి పనులు

శేరిలింగంపల్లి: నగర జీవనం ప్రస్తుతం హడావుడి నెలకొంది. ఏ కొద్ది విరామ సమయం దొరికినా ఆహ్లాద వాతావరణంలో సేద తీరాలనే కోరిక అందరిలోనూ నెలకొంటోంది. ఇంటికి, కాలనీకి సమీపంలో ఇలాంటి వాతావరణం ఉంటే అక్కడికి రోజూ వెళ్లాలనే కోరిక కూడా అందరిలోనూ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కాలనీల్లో పార్కుల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడాకాలనీలో ప్రత్యేక థీమ్ పార్కు ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. భగీరథ పార్కును 'ఇలూజన్ థీమ్ పేరుతో అభివృద్ధి చేస్తున్నారు. హుడాకాలనీలో రెండు థీమ్ పార్కుల ఏర్పాటుతో కాలనీ రూపురేఖలే మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. దీంతో పనులు ప్రారంభ మయ్యాయి. అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తూ స్థానికులే కాకుండా పరిసర ప్రాంతాల్లోని సాయిరాం కాలనీ, సైబర్ ఎన్‌క్లేవ్, డైమండ్ హైట్స్, నవోదయకాలనీలతో పాటు అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీవాసులు కూడా సేదతీరేలా దీన్ని తీర్చి దిద్దుతున్నారు. ఇప్పటికే ఆయా పార్కులలో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో



ఇలూజన్ పార్కులో వాకింగ్ ట్రాక్ పనులు

పాటు స్థలం లెవలింగ్ పనులు కొనసాగుతున్నాయి. అదే విధంగా ఇటీవల బోర్లను వేశారు. త్వరలో దీన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు.

పార్కులో ఏర్పాటు చేసే పనులు ఇవే

- ఇలూజన్ థీమ్‌తో అభివృద్ధి
- నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు
- రూ.2.60 కోట్ల వ్యయంతో పార్కు నిర్మాణం
- ప్రత్యేకంగా సైకిల్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు
- చిల్డ్రన్ ప్లే ఏరియా కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు
- ఓపెన్ జిమ్ ఏర్పాటు
- గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు

నల్లగండ్ల హుడా కాలనీలో రెండు పార్కులు..

నల్లగండ్ల హుడాకాలనీలో పార్కుల కోసం కేటాయించిన స్థలాల్లో రెండింటిని థీమ్ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

- అందులో మొదటిది 'ఎకో పెంట్రిక్ థీమ్‌తో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి
- దీన్ని నాలుగు ఎకరాల్లో రూ. 3.60 కోట్ల వ్యయంతో నిర్మాణం
- కొత్తగా రెండవ పార్కుగా 'ఇలూజన్' పేరిట మరొకటి అభివృద్ధి చేస్తున్నారు.
- హుడాకాలనీలో ఈరెండు పార్కులు అందుబాటులోకి వస్తే స్థానికులు సేదతీరేందుకు ఎంతో ఉపయుక్తంగా మారుతాయి.
- రెండు పార్కులలో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

6న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

గచ్చిబౌలి: నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్న లైట్ హౌస్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏప్రిల్ 6న ప్రారంభించనున్నారు. చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఎదురుగా జీహెచ్ఎంసీ నిర్మించిన భవనంలో ఇక నుంచి శిక్షణ ఇస్తారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత, వెస్ట్ జోనల్ కమిషనర్ ఎస్.శంకరయ్య, చందానగర్ సర్కిల్ ఉప కమిసనర్ సుదాంష్ తదితరులు పాల్గొంటారు.

వర్సిటీలో మౌలిక వసతులకల్పనకు అన్ని చర్యలు



నూతన బస్సు, అంబెలెన్స్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ తెలిపారు. గచ్చిబౌలి లోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన 50 సీట్లతోకూడిన బస్సును, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పనిచేసే అధికార యంత్రాంగం, సిబ్బందితోపాటు విద్యార్థులందరికీ వీటి వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంద న్నారు.

అన్ని కాలనీలు,బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు



శేరిలింగంపల్లి డివిజన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పిస్తామని కార్పొరేటర్ రాగంనాగేందర్ యాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆదర్శనగర్, నెహ్రూనగర్, గోపీనగర్‌లలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లను పరిశీలించారు. దశలవారీగా డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్‌యాదవ్ పాల్గొన్నారు.

వస్తాద్ అడివయ్యకు ఘన నివాళి

రాయదుర్గం: ఖాజాగూడకు చెందిన ప్రముఖ వస్తాద్ అడివయ్యకు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన 12వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సొంతగ్రామమైన ఖాజాగూడలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నరులకు పండ్లు పంపిణీ చేయడంతోపాటు క్రీడాకారులకు క్రీడాసామాగ్రిని కూడా పంపిణీ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో స్థానికులు సంతోష్, ప్రభాకర్, గణేష్‌గౌడ్, నరేందర్, శ్రీకాంత్‌గౌడ్, వీరేష్‌యాదవ్, సిద్దేశ్వర్, గణేష్, పలువురు వస్తాద్ శిష్యులు పాల్గొన్నారు.



ఖాజాగూడలో వస్తాద్ అడివయ్యకు ఘనంగా నివాళులు అర్పిస్తున్న స్థానికులు, ఆయన శిష్యులు

ప్రతిభ చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



మాదాపూర్: దేశవ్యాప్తంగా 3 నుండి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన ఇంట్‌షో పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ శుక్రవారం తెలిపారు. అలిండియా లెవల్‌లో ఇంట్‌షో 150 ల్యాప్‌టాప్‌లను ప్రకటించగా అత్యధికంగా 96(64శాతం) మంది విద్యార్థులు , ల్యాప్‌టాప్‌లను గ్రాండ్ ప్రైజ్‌లుగా సాధించారన్నారు. ఇంట్‌షో 750 ట్యాబ్‌లను ప్రకటించగా అత్యధికంగా 472(63శాతం) మంది శ్రీచైతన్య విద్యార్థులు ట్యాబ్‌లను సాధించారని తెలిపారు. టాప్ 5 ర్యాంకులలో 58 శాతం ర్యాంకులను , వారు ప్రకటించిన మెడల్స్‌లో 61శాతం మెడల్స్‌ను కూడా సాధించినట్లు తెలిపారు.

చెరువుల అభివృద్ధిపై చిత్తశుద్ధిలేదు

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్దచెరువు అభివృద్ధి పనులను గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రారంభించి ఇప్పటి వరకు పూర్తిచేయలేదని చెరువుల అభివృద్ధిపై ఎమ్మెల్యే, కార్పొరేటర్,అధికారులకు చిత్తశుద్ధి లేదని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. చందానగర్‌లోని గంగారం పెద్ద చెరువును శుక్రవారం ఆయన పరిశీలించారు. చెరువు శిఖం భూమిలో మట్టి కుప్పలు, భవన నిర్మాణ వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా వేస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల సమస్యలను పరిష్కరించాలి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు శుక్రవారం ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ప్రిన్సిపాల్ అందుబాటులో లేని కారణంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు వర్షిత్, గాదె పవన్, రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. రోజురోజుకు ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జయలక్ష్మి సమస్యలు తీర్చడమే కాదు వినడానికి కూడా సమయం ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఆర్‌సీలో లిఫ్ట్ పనిచేయక పోవటంతో దివ్యాంగ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్, కళాశాలలో వైఫై సౌకర్యం కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.



ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

- కెమికల్ ఇంజినీరింగ్‌కు ఇంకా నూతన భవనం నిర్మించలేదని తెలిపారు. కొత్త టేబుల్స్, కుర్చీలను తెప్పిస్తామని ఆరు నెలల కిందటే హామీ ఇచ్చినా ఇంత వరకు లేవన్నారు. మెస్‌లో బాయిలర్స్ పాడయిపోయినా ఇంత వరకు బాగు చేయించలేదని తెలిపారు. దీంతో ఉడికి ఉడకని అన్నం తినాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రిన్సిపాల్‌కు సమస్యల గురించి మొర



పెట్టుకుంటే హెచ్‌ఓడీకి చెప్పి బెదిరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేయడం లేదని.. నిధులు కేటాయించకపోతే మేమేం చేయాలని బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే తరగతులను బహిష్కరించి విశ్వవిద్యాలయంలో బంద్‌కు పిలుపునిస్తామన్నారు. కళాశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శివకృష్ణ, బ్రహ్మం, ఆకాష్, రంజిత్, మంజునాథ్, సారథి, చందు, యశ్వంత్, స్నేహిత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామాజిక సేవ అభినందనీయం

ఇంద్రేశం సర్పంచ్ నర్సింలు



సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్, సర్పంచ్, కార్యదర్శి

పటాన్‌చెరు టౌన్: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని ఇంద్రేశం సర్పంచ్ దండు నర్సింలు అన్నారు. ఇంద్రేశంలో ఏడు రోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరు ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ మానెమ్మ, గ్రామ కార్యదర్శి సుభాశ్‌లు వాలంటీర్లను అభినందించారు. వారి సేవను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ...వారం రోజులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంద్రేశం గ్రామంలో పర్యటించి కేంద్ర యువజన శాఖ రూపొందించిన నమూనా ఆధారంగా సర్వే నిర్వహించారని చెప్పారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం, గృహ సంబంధ సమస్యలపై సర్వేను చేశారన్నారు. గ్రామంలో పేదలకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిత్యావసర సరుకులను అందజేశారు. హెల్త్ క్యాంపు నిర్వహించి పరీక్షలు చేయించారు. పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీహరి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాండు



మాట్లాడుతున్న పాండు

పటాన్‌చెరు టౌన్: కార్పొరేటర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పాండు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీసీ నాయకుడిగా కార్పొరేటర్ స్థాయిలో పూజలు చేయడం మింగుడపడక దౌర్జన్యానికి పాల్పడారని ఆరోపించారు. కార్పొరేటర్‌పై దాడికి నిరసనగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్పొరేటర్‌పై దాడి చేస్తే, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని వారు సమావేశంలో ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోజుకోటి, ప్రభాకర్ యాదవ్, ఐలేశ్, కుర్మసంఘం , బీసీ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ వ్యవహార తీరు బాధాకరం

శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయ చైర్మన్ మనోహర్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: కార్పొరేటర్ మెట్టుకుమార్ చొక్కా పట్టుకొని దురుసుగా వ్యవహరించిన తీరు బాధాకరంగా ఉందని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయ చైర్మన్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ చైర్మన్ మాట్లాడారు... ఆలయ నిర్వహణ, ఇతర అవసరాలకు ఇప్పటివరకూ సొంతనిధులు రూ.కోటి వరకూ ఖర్చు చేసినట్టు చెప్పారు. ఆలయ పవిత్రతను కాపాడటమే కాకుండా, నిరంతరం ఆలయబాగోగులు చూస్తున్న తనను కార్పొరేటర్ చొక్కా పట్టుకుని దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. శ్రీ కోదండ సీతారామ స్వామి కల్యాణం సందర్భంగా చిలుకూరి బాలజీ ఆలయ గాయకులు సంకీర్తన చేస్తుండగా మైకు లాక్కుని వారిని కార్పొరేటర్ గెంటేశారన్నారు. ఈ విషయంలో నేను క్షమాపణ చెప్పాల్సి వచ్చిందన్నారు. గురువారం ఆలయం వద్ద జరిగిన ఘటనతో మనోవేదనకు గురవుతుంటే రాత్రి ఇంటిపై రాళ్ల దాడి చేశారన్నారు. కార్పొరేటర్ గెలుపులో సహకరించినట్టు ఆలయ చైర్మన్ పేర్కొన్నారు.

ఇక పటాన్‌చెరులోనే రిజిస్ట్రేషన్లు

- ఫలించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కృషి
- కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహాలు షురూ
- నెలలో పటాన్‌చెరులో నూతన భవనం ప్రారంభం
- ఏప్రిల్ 1 నుంచి సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో
- పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పనులు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: హామీలు ఇవ్వడం ఆపై మర్చిపోవడం అలవాటుగా మారిన ప్రస్తుత రాజకీయాల్లో, హామీ ఇస్తే అమలు చేసే వరకు పట్టువదలని విక్రమార్కుడిలా నిరంతరం కృషి చేసే నాయకుడిగా పేరొందిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి పర్వదినాన శుభవార్త అందించారు. నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరులో సబ్ రిజిస్ట్రార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్ జీఓ 30ని జారీ చేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రపురం మండలాలను చేరుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో రోజురోజుకి రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్థానికంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేదన్నారు. రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉత్పన్నమయ్యేవని గుర్తుచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామన్నారు. ఎన్నికల సభలో సీఎం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నూతన భవనం అందుబాటులో వచ్చేవరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో..

పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో నూతన కార్యాలయ భవనాన్ని నెలలో సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రధాన హామీల్లో రెండు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు రూ.70 కోట్లతో బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపేట వరకు వంద అడుగుల రహదారిని విస్తరించడం జరిగిందన్నారు. పటాన్‌చెరు, జిన్నారంలో మున్సిఫ్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హెచ్ఎండీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఆడిట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చిట్స్ సేవలు సైతం పటాన్‌చెరులోనే అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, పటాన్‌చెరు ఎంపీపీ సుష్మా, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజు, షేక్ హుస్సేన్, గోపాల్, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.